క్లుప్తంగా

శ్మశానవాటికలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



సిమెంట్ బెంచీల వద్ద యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని డాక్టర్ ముచ్చర్ల సంజయ్ అన్నారు. యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో అడవిపాలెం శ్మశాన వాటికలో ఏర్పా టు చేసిన నాలుగు సిమెంట్ బెంచీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెనుమాక రామ్మోహనరావు, జిక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, పోకల రాము పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పర్యవేక్షణ



ఆచంట రామేశ్వరుని సన్నిధిలో అడిషనల్ ఎస్పీ భీమారావు

పెనుగొండ: ఆచంట రామేశ్వర స్వామి ఆలయం వద్ద మహా శివరాత్రికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని అడిషనల్ ఎస్పీ భీమారావు ఆదేశించారు. శుక్రవారం ఆచంటేశ్వర స్వామిని దర్శించుకుని అనంతరం శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ నెల 24 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో సత్వరం ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా మహాశివరాత్రి రోజు రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్య హాజరవుతారు కాబట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటరమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కవలల దినోత్సవం



సిద్ధాంతంలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఉన్న కవలలు

పెనుగొండ: సాధారణంగా కవలలు అరుదుగా ఉంటారు. కాని, సిద్ధాంతంలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఏకంగా ఐదు కవల జంటలు విద్యాభ్యాసం చేస్తున్నారు. శనివారం కవలల దినోత్సవం కావడంతో వారు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారారు. విద్యార్థులకు శుక్రవారం నుంచే తోటి మిత్రులు కవలల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పడం ప్రారంభించారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యం సైతం శనివారం వారిని ఘనంగా అభినందించడానికి ఏర్పాట్లు చేసింది.

సెల్‌ఫోన్ షాపుల్లో తనిఖీలు

భీమవరం: పట్టణంలోని నాలుగు సెల్‌ఫోన్ షాపుల్లో యాపిల్ లోగోతో నకిలీ సెల్‌ఫోన్లు విక్రయిస్తున్నట్లు యాపిల్ సంస్థ ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం దాడులు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు శుక్రవారం చెప్పారు. పట్టణంలోని మెంటేవారితోట బైపాస్‌రోడ్డు, పీపీరోడ్డు, రేమండ్స్ షోరూమ్ వద్ద గల మరో షాపు, రెస్ట్‌హౌస్‌రోడ్డులోని షాపుల్లో తనిఖీలు నిర్వహించి యాక్సెసరీస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

దుర్గాదేవికి గాజుల ఉత్సవం

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైన దుర్గాదేవి అమ్మవారికి మాఘమాసం అష్టమి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి గాజుల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుమారు 50 వేల గాజులతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఎస్వీ పవన్‌కుమార్‌చే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు సేవకులచే ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతులు పాల్గొన్నారు.

24 నుంచి స్పోర్ట్స్ మీట్

పెంటపాడు: తాడేపల్లిగూడెం ఏఎస్ఆర్ హోమియో కళాశాలలో ఈనెల 24 నుంచి 26 వరకు అంతర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఉప్పలపాటి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పరిధిలోని ఆయుష్, హోమియో, ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. 24న ఉదయం 9 గంటలకు ప్రారంభ కార్యక్రమానికి ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహం, ఏఎస్ఆర్ సంస్థల చైర్మన్ ఆకుల విజయవర్ధన్, స్పోర్ట్ బోర్ట్ కార్యదర్శి ఇ.త్రిమూర్తి, ట్రినిటీ ఆసుపత్రి డైరెక్టర్ విజయ్ సృజిత్ హాజరవుతారని తెలిపారు.

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం



లంకలకోడేరులో నిర్మాణం పూర్తయ్యి వైద్య సేవలు అందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



మేడపాడులో మధ్యలోనే నిర్మాణం ఆగిపోయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

యలమంచిలి: అత్యవసర సమయంలో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించినే ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యమొచ్చింది. కూటమి ప్రభుత్వ పెద్దల అక్కసుతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయి మొండిగోడలతో దర్శనిమిస్తుంది. గ్రామీణ పేద ప్రజలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేడపాడు, లంకలకోడేరు గ్రామాలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కొత్త భవనాలను మంజూరు చేశారు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. అందులో లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూర్తయి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తుండగా, మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 8 నెలలు గడుస్తున్నప్పటికీ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన మేడపాడు ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో నిరుపయోగంగా తయారైంది. పేద ప్రజలకు ఉపయోగపడే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరితగతిన పూర్తిచేస్తే పేదలు, దళితులు, బడుగు బలహీనవర్గాలు, కార్మికులు వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. ఈ భవన నిర్మాణం పూర్తి చేయకపోతే భవనం శిథిలావస్థకు చేరుకునే ప్రమాదముంది. ఇప్పటికే భవనం చుట్టూనే కాకుండా భవనం అరుగులమీద కూడా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇలానే వదిలేస్తే ఇంతవరకు ఖర్చు పెట్టినదంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

మదర్ పీహెచ్‌సీకి అన్నీ ఇబ్బందులే

యలమంచిలి మండలంలో మేడపాడు, యలమంచిలి, దొడ్డిపట్ల గ్రామాలలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మేడపాడు పీహెచ్‌సీ 1965 ప్రారంభమవ్వగా మిగిలిన రెండు తర్వాత కాలంలో ఏర్పడ్డాయి. జిల్లాలోఉన్న మదర్ పీహెచ్‌సీలలో మేడపాడు కూడా ఒకటి. అయితే మిగిలిన రెండు పీహెచ్‌సీలు 24 గంటలు సేవలు అందిస్తుండగా మేడపాడు పీహెచ్‌సీ మాత్రం ఇంకా 24గంటల పీహెచ్‌సీ కాలేదు. కొత్త భవనం పూర్తిచేసి, ఈ పీహెచ్‌సీని కూడా 24 గంటలు పీహెచ్‌సీ చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి



మల్లవరంలో సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: భూ రీసర్వేని పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లవరం గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే తీరును ఆయన పరిశీలించారు. సర్వే నిర్వహించే ముందు భూ-యజమానులకు సమాచారం అందించాలని, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓ లక్కు వెంకటస్వామి ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా చర్యలు

నరసాపురం: పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ నిర్మాలాకుమారి శానిటేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పర్యటించారు. దుకాణాల యజమానులతో మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో సత్ఫలితాలు

పోడూరు: సామూహికంగా ఎలుకలను నిర్మూలిస్తేనే రైతులకు సత్ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ అన్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు ఎలుకల మందు కలిపిన నూకలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ వేడంగి, పండితవిల్లూరు, కవిటం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి రైతులకు ఎలుకల మందు కలిపిన ఎరను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా సార్వా, దాళ్వా సీజన్‌లో ఎలుకల వల్ల వరి రైతులకు నష్టం వాటిల్లుతోందన్నారు. సామూహికంగా అందరూ ఒకేరోజు పొలాల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో, తోటల వద్ద బొరియల్లో ఎలుకల మందు ఎర ను పెట్టడం వల్ల ఎలుకలను సమర్థవంతంగా నిర్మూలించవచ్చన్నారు.



పోడూరు: వేడంగిలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ

యలమంచిలిలో..

యలమంచిలి: సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు ఉచితంగా బ్రొమోడయోలిన్ ముందు పొట్లాలను పంపిణీ చేశామని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి తెలిపారు. ఈ ఎర మందు తయారు చేసే విధానాన్ని కూడా రైతులకు వివరించినట్లు ఆమె చెప్పారు. రైతులందరూ తప్పనిసరిగా సామూహికంగా మందు పెడితేనే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు.

పెనుగొండలో..

పెనుగొండ: సామూహిక ఎలుకల నిర్మూలనతోనే ఎలుకలను నివారించగలుగుతామని ఆచంట మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు తెలిపారు.



యలమంచిలి: మట్లపాలెంలో ఎలుకల మందు అందజేస్తున్న వ్యవసాయాధికారి చిందులూరి దేవి



పెనుగొండ: పెనుమంచిలిలో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి నాగరాజు

శుక్రవారం ఆచంట మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రాలు, రైతు సంఘాలు, పంచాయతీల వద్ద విషపు ఎరలను పంపిణీ చేశారు. బోమోడయోలిన్ విషపు ఎరను నూనే, నూకలు కలిపిన ఎరను 10 గ్రాముల వంతున పొట్లాలు కట్టి ఎలుకల బొరియల వద్ద పెట్టాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామాల్లోనూ 48 కేజీల మందును పంపిణీ చేసినట్లు తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో అన్ని గ్రామాలకు చెందిన రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టేందుకు గాను అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం ఉచితంగా ఎర కలిపిన బ్రోమో డైల్ మందును పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి అడబాల జోత్స్న తెలిపారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీల సహకారంతో రైతులకు ఈ మందును ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుల సమావేశం

పోడూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునః ప్రారంభించాలని శ్రీ వెంకటేశ్వర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పులపర్తి సర్వేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకొల్లు పట్టణంలోని సంఘ కార్యాలయం వద్ద శుక్రవారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్వేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నుంచి క్లెయిములు రాకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలనీ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ధర్నా తలపెట్టినట్లు సర్వేశ్వరరావు తెలిపారు. కార్మిక సంఘం నాయకులు, కార్మికులు ధర్నాలో పాల్గొని అన్ని జిల్లా కలెక్టర్లకు, తహశీల్దార్ కార్యాలయాల్లోనూ, సచివాలయాల్లోనూ అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నర్రెడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు యాతం కృష్ణ, ప్రధాన కార్యదర్శి బొప్పా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిలు పెచ్చెట్టి వెంకట కృష్ణారావు, పెంటపాటి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం గౌరవాధ్యక్షుడు పులపర్తి సర్వేశ్వరరావు

సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలి

పోడూరు: 'సూర్యఘర్ యోజన' పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ పిలుపునిచ్చారు. పోడూరు సచివాలయంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహావసర విద్యుత్ వినియోగం కోసం సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయన్నారు. ఎలక్ట్రికల్ ఏడీ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను 70 శాతం వరకు తగ్గించుకోవచ్చని తెలిపారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కోసం 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకోసం 2 కిలోవాట్లకు రూ.1.70 లక్షలు, 3 కిలోవాట్లకు రూ.2.30 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులు తమ గ్రామంలోని ఎలక్ట్రికల్ లైన్‌మెన్‌ను గానీ, పోడూరు సబ్‌స్టేషన్‌లో గాని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.మంగాకుమారి, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోడూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

మాతృభాషను పరిరక్షించుకోవాలి



ఆచంట వేమవరం పాఠశాలలో విజేతలతో ఉపాధ్యాయులు

పోడూరు: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాలకొల్లు పట్టణంలోని ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ×మాతృభాష విశిష్టత¥ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతికి, గుర్తింపునకు మూలం మాతృభాషేనన్నారు. మాతృభాషను విస్మరించడం వల్ల కలిగే నష్టాలను ఆమె వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాసరచన, గేయ రచన, కవితల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు ఏఎస్ఎస్ఎం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఆచంట వేమవరంలో..

పెనుగొండ: మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఆచంట వేమవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాలు, వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై సుధాకర్ బాబు, తెలుగు పండిట్ బండి ప్రసాద్, గుత్తుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

పెనుగొండ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆచంట ప్రభుత్వ ఐటీఐలో కంప్యూటర్ కోర్సుపై ఉచితంగా శిక్షణనివ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐవీ సత్యనారాయణ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంప్యూటర్‌పై పూర్తి అవగాహనతో పాటు, జాబ్ స్కిల్స్ అదనంగా నేర్పిస్తామన్నారు. వచ్చే నెల 3 నుంచి కళాశాల స్కిల్ హబ్‌లో కోర్సును ప్రారంభిస్తామని, శిక్షణ పొందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌లు అందిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు కళాశాల స్కిల్ హబ్‌లో నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 63049 22617 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నరసింహారెడ్డి పోరాట పటిమను భావితరాలకు అందించాలి

పెనుమంట్ర: భారతదేశ ప్రథమ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమను, జీవిత చరిత్రను బావిపౌరులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వేణుగోపాల రెడ్డి అన్నారు. శుక్రవారం మార్టేరు పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం భవనంలో జిల్లా రెడ్డి సంఘం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మార్టేరు ఎంపీటీసీ సభ్యుడు గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ శనివారం తణుకు రెడ్డి జన సంఘ భవనంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న178వ వర్ధంతి సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు కేకేఆర్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు తాడి భీమారెడ్డి, మేడపాటి విజయ రెడ్డి, చింత ధర్మవీర నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి

రైతుల ప్రయోజనార్థం గ్రామసభలు

పాలకోడేరు: రైతులకు ఆమోదయోగ్యమైన భూముల రీ సర్వే చేపట్టేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నాదమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో శుక్రవారం భూముల రీ సర్వేలో లోటు పాట్లను తెలుసుకునేందుకు గ్రామస్తులతో ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో పాటు కలెక్టర్ కూడా నేల మీద బరకంపై కూర్చుని గ్రామసభను నిర్వహించి రైతుల నుంచ సమస్యలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులతో మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలు లేకుండా చక్కటి పరిష్కార మార్గాన్ని అందించేందుకే రీ సర్వేను చేపట్టామన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి అపోహలకు తావులేని వాస్తవ రికార్డులను రూపొందించడమే లక్ష్యమన్నారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి తొలుత రీ సర్వేను ప్రారంభించారన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో గత 15 రోజులుగా రీ సర్వే నిర్వహిస్తున్నారని వాస్తవ భూమి లెక్కలు నిర్ధారించుకున్న అనంతరం వ్యక్తిగతంగా భూముల కొలతలను రైతుల సమక్షంలోనే నిర్వహిస్తామన్నారు. అలాగే రీ-సర్వేలో ఉత్పన్నమయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రతి మండలానికి ఒక రీసర్వే డీటీని నియమించామన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 37 వేల ఎకరాలను సర్వే చేయవలసి ఉండగా, ఇప్పటి వరకు 22 వేల ఎకరాలు సర్వే పూర్తి చేశారన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కవిటంలో జాతర జోరు





గ్రామదేవతలు శ్రీ మారెమ్మ, శ్రీ పోలేరమ్మ

జాతర నిర్వహణకు భారీగా ఏర్పాట్లు

పోడూరు: ఐదేళ్లకు ఒకసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే గ్రామదేవతల జాతరకు కవిటం గ్రామం ముస్తాబవుతోంది. గ్రామదేవతలైన శ్రీ మారెమ్మ, శ్రీ పోలేరమ్మ అమ్మవార్లకు ఐదేళ్లకు ఓ సారి గ్రామస్తులు ఎంతో ఘనంగా జాతర నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 23న మారెమ్మ, పోలేరమ్మ జాతర వేడుకు భారీగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. జాతరకు ఏడాది ముందు గ్రామదేవతలైన మారెమ్మ, పోలేరమ్మ వార్లను నడివీధిలో పూరిపాక వేసి పుట్టింటికి తీసుకొస్తారు. ఏడాది పొడవునా అమ్మవార్లకు దీపదూప నైవేద్యాలతో పూజలు నిర్వహించి పొన్పులు సమర్పిస్తుంటారు. జాతర వేడుకకు రెండు, మూడు రోజుల ముందు అమ్మవార్లకు కావిడిలతో చలిమోర సమర్పిస్తారు. జాతర ముందు రోజు అమ్మవార్లను ఇంటింటికీ తీసుకెళ్లి పొన్పులు సమర్పిస్తారు. జాతర రోజున సాయంత్రం 5:30 గంటలకు అమ్మవార్లకు బుట్టలతో పెరుగన్నం, గారెలు, బూరెలు తీసుకెళ్లి నైవేథ్యం పెడతారు. రాత్రి 8.30గంటలకు జాతర సంబరం ప్రారంభమవుతుంది. తెల్లవారుజాము వరకు జరిగే సంబరం పూర్తయ్యాక అమ్మవార్లను గ్రామశివారులో ఆలయానికి (మెట్టింటికి) తీసుకెళ్తారు.



వీధివీధినా ప్రత్యేక కార్యక్రమాలు

జాతర వేడుక సందర్భంగా గ్రామంలో దాదాపు అన్ని వీధుల్లోనూ సాంస్కృతిక, వినోద కార్యక్రమాల నిర్వహణకు స్టేజీలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామానికి ప్రధాన ముఖద్వారమైన వంతెన సెంటర్‌లోనూ, గ్రామంలో ప్రధాన సెంటర్‌ల వద్ద విద్యుద్దీపాలంకరణ సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

భారీగా సంఖ్యలో జనం

ఐదేళ్లకు ఒకసారి జరిగే జాతర కావడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, ఇతర దేశాల్లో స్థిరపడిన వారితో పాటు ఉపాధి నిమిత్తం తరలివెళ్లిన కవిటం గ్రామవాసులు కుటుంబసమేతంగా జాతరకు స్వగ్రామానికి వస్తారు. జాతర వేడుకను తిలకించేందుకు కవిటం పరిసర ప్రాంతాల తో పాటు ఉభయగోదావరి జిల్లాల నలుమూలల నుంచి దూర ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివస్తారు. ఈ ఏడాది జరిగే జాతరకు దాదాపు లక్షమంది జనం వస్తారని అంచనా వేస్తున్నారు.



కవిటంలో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ హోర్డింగ్‌లు